సాక్షి గుంటూరు

శనివారం, 2, ఆగస్టు, 2025



స్మార్ట్ మీటర్లపై పోరాటం

కొల్లూరు : ప్రజలు విద్యుత్ స్మార్టు మీటర్లపై పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వి. వెంకట్రామయ్య అన్నారు.



గోవాడలో విశేష పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకారం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అమ్మ వారిని పసుపు కొమ్ములతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ పాలీసెట్– 2025 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5న పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో సివిల్, ఈసీఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్ఈ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 83329 11155, 98660 09672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫెడరిక్ హయ్యర్‌కు నివాళులు



భట్టిప్రోలు: ఆంధ్ర ఇవాంజలికల్ 184వ లూథరన్ సంఘ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పితామహుడైన ఫాదర్ జాన్ క్రిస్టియన్ ఫెడరిక్ హయ్యర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనలు చేశారు. లూథరన్ లోగో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు. కాపరి రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యువత, పిల్లలు, సంఘస్తులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పల్నాడు జిల్లా చైర్మన్ ఎల్.వి.రామిరెడ్డి (ఎస్టీయూ), సెక్రటరీ జనరల్ బి.సంపత్‌బాబు (ఏపీటీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు శనివారం స్టేషన్ రోడ్డులోని ధర్నా చౌక్ వద్దకు హాజరు కావాలని కోరారు. పీఆర్‌సీని అమలు చేయటంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలన్నారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర 18 డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి, వీరలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ నిర్వహించామని, సాయంత్రం పద్మావతి అమ్మవారికి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, ఊంజల్ సేవతో కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలు ప్రారంభం


నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం జిల్లాస్థాయి ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న జిల్లా నుంచి ఎంపికైన జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపనున్నట్టు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా మూడు విధానాలను పాటించనున్నట్టు పేర్కొన్నారు. వీటిలో ఉపాధ్యాయుని వ్యక్తిగత దరఖాస్తు, ఐదుగురు సహ ఉపాధ్యాయుల ద్వారా సిఫారసు, లీప్ యాప్ ఆధారిత పనితీరు ఆధారంగా జిల్లా ఎంపికలు జరుగుతాయని వివరించారు.

అభాగ్యులకు పునర్జన్మ

- అవయవ దానంతో నిలుస్తున్న విలువైన ప్రాణాలు
- రేపు జాతీయ అవయవ దాన దినోత్సవం

అవయవదానం వల్ల మరొకరికి నూతన జీవితాన్ని ఇవ్వొచ్చు. భూమిపై లేకున్నా ఇతరుల్లో జీవించి ఉండొచ్చు. జిల్లాలో పలువురు బ్రెయిన్‌డెడ్ అవుతున్నారు. అలాంటి వారి కుటుంబ సభ్యులకు అవగాహన పెంచడం ద్వారా ఎంతో మందికి నూతన జీవితాన్ని ప్రసాదించే వీలుంది. ఏటా ఆగస్టు 3న 'నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: అవయవాలు అవసరమైన వారు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. దీనికి జీవన్‌దాన్ పేరిట సర్కారు ప్రత్యేక ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా 2015 నుంచి జీవన్‌దాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి కోసం పలువురు దరఖాస్తు చేసుకుని అవయవాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఆపరేషను ఖర్చులు భరించలేక కూడా జీవన్‌దాన్ పథకంలో పేర్లు నమోదు చేయించుకోని వారు అధికంగానే ఉన్నట్లు సమాచారం. అవయవాల కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పలువురు ఎదురు చూస్తున్నారు. సకాలంలో వీరికి అవయవాలు లభించకపోతే ప్రాణాలు కోల్పోవాల్సిందే. మూఢ నమ్మకాలు, అవగాహనలోపంతో ఇప్పటికీ పలువురు అవయవ దానానికి ముందుకు రావడం లేదు. తాము ఈ లోకంలో లేకున్నా మరొకరికి దానం చేసిన అవయవాల వలన సజీవంగా ఉండే గొప్ప అవకాశం ఇది. కుటుంబసభ్యులు కూడా ఆ సమయంలో బాధను తట్టుకుని ముందుకురావడంతో పలువురి ప్రాణాలు నిలిచాయి. అభాగ్యులకు పునర్జన్మ లభించడంతో వారి కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరిశాయి.



ఏవి దానం చేయవచ్చంటే..

మనిషి కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు. ఇలా సేకరణకు ఐదు గంటల సమయం పడుతుంది. ఆ తర్వాత గుండె, ఊపిరితిత్తులను అవసరమైన వారికి మూడు గంటల్లోగా అమర్చాలి. కాలేయాన్ని 5 నుంచి 8 గంటలలోపు, మూత్రపిండాలను 15 నుంచి 18 గంటల్లోపు అమర్చాలి. కళ్లు చాలా కాలం నిల్వ చేయవచ్చు.

నమోదు చేసుకోవడం ఇలా...

ఎవరైనా దీనికి అంగీకరించే ముందు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తనకు తెలిసిన వారందరికీ అవయవ దానం చేస్తున్నట్లు చెప్పాలి. దీని వలన సదరు వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయితే త్వరగా అవయవాలు దానం చేసేందుకు వీలు కలుగుతుంది. www.jeevandan.ap.gov.in వెబ్‌సైట్‌లో డోనర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం వారికి ఓ కార్డును అందజేస్తుంది.

గుంటూరులో కేంద్రాలు...



జీవన్‌దాన్ కార్యక్రమం గుంటూరు జిల్లాలోని గుంటూరు జీజీహెచ్, వేదాంత హాస్పిటల్, అశ్విని హాస్పిటల్, రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీలక్ష్మి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఎన్ఆర్ఐ హాస్పిటల్, కాటూరి హాస్పిటల్, మణిపాల్ హాస్పిటల్, శివ హాస్పిటల్, సురక్ష హాస్పిటల్, ఆదిత్య హాస్పిటల్, గుంటూరు కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశిష్ట హాస్పిటల్, డీవీసీ హాస్పిటల్‌లలో అందుబాటులో ఉంది.

అవయవాలు కావాల్సి వస్తే...

అవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నెంబరు ఇస్తారు. అవయవదానం చేసేందుకు వెబ్‌సైట్‌లో సమాచారం ఇస్తే తక్షణమే సీరియల్ నెంబరు ప్రకారం అవయవాలు అమర్చేలా జీవన్‌దాన్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



అవయవ దానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు 20 ఏళ్లుగా 15 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంఘం కృషి ఫలితంగా ఏపీ, తెలంగాణల్లో 58 వేల మంది అవయవదానానికి ముందుకొచ్చారు. 978 మంది అవయవదాతలు పేర్లు నమోదు చేసుకున్నారు. దాతలను ప్రోత్సహించేలా ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తే బాగుంటుంది.

– డాక్టర్ యశస్వి రమణ, అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

బ్లడ్ గ్రూప్ కలవకున్నా కిడ్నీ మార్పిడి



బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవ్వకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసే ఆధునిక వైద్య పద్ధతి నేడు అందుబాటులోకి వచ్చింది. రోగులకు ఈ విధానం ఒక వరం. గుంటూరు వేదాంత హాస్పిటల్‌లో ఆపరేషన్‌లు విజయవంతంగా చేస్తున్నాం. ఈ పద్ధతిని రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా మా ఆస్పత్రిలోనే అందుబాటులోకి తెచ్చాం. రోగులకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ చింతా రామకృష్ణ, నెఫ్రాలజిస్టు, గుంటూరు

అందరూ ముందుకు రావాలి



గుంటూరు జీజీహెచ్‌లో 2016లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయటం ప్రారంభించాం. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా వీటిని చేస్తున్నాం. ఇప్పటివరకు దానంగా వచ్చిన కిడ్నీలను గుంటూరు జీజీహెచ్‌లో 25 మందికి ఉచితంగా అమర్చాం. ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అపోహలు వీడాలి. స్వచ్ఛందంగా అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి.

– డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజిస్టు, గుంటూరు జీజీహెచ్

నేడు గవర్నర్ రాక

విజ్ఞాన్ వర్సిటీలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



చేబ్రోలు: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం జరిగే స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. దీని దృష్ట్యా అక్కడ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసు బందోబస్తు, గవర్నర్ రోడ్డు మార్గంలో వచ్చే ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రూట్ బందోబస్తు ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తెనాలి డీఎస్పీ బి జనార్ధన్, ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండలు, పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీకే కన్వెన్షన్‌లో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



మంగళగిరి : మండలంలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట ఉన్న సీకే కన్వెన్షన్‌లో శనివారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ భార్గవతేజలు శుక్రవారం పరిశీలించారు. పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ సభావేదిక పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ టి.పార్వతీశం, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, డీఎస్పీలు మురళీకృష్ణ, ఎం.రాము, డీటీసీ కె. సీతారామిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ వై. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కె. దినేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి శంకర్‌విలాస్ బ్రిడ్జిపై

రాకపోకలు నిలిపివేత

- కూల్చివేత పనులు ప్రారంభం
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): శంకర్‌విలాస్ బ్రిడ్జిపై ఈ నెల 9 నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపివేసి కూల్చివేత పనులు చేపడుతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అధికారులతో కలిసి నగరంలో జరుగుతున్న, చేపట్టనున్న అభివృద్ధి పనులపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రస్తుతం 2 పిల్లర్స్ కాంక్రీట్ పూర్తి అయ్యాయని, ఈ నెల 9 నుంచి బ్రిడ్జి పై రాకపోకలు పూర్తిగా నిలిపేసి, కూల్చివేత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 135 స్ట్రక్చర్లు ఉండగా వాటిలో 74 మంది అంగీకారం తెలిపారని, వారికి నష్ట పరిహారం ఇచ్చి నిర్మాణాలు తొలగించామన్నారు.
- నందివెలుగు రోడ్‌లోని ఆర్‌ఓబీ పనులు 10 రోజుల క్రితమే ప్రారంభమయ్యాయని, 8 నెలల గడువులో పూర్తి చేసేలా కాంట్రాక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారని తెలిపారు.
- మణిహోటల్ సెంటర్‌లో కల్వర్ట్ నిర్మాణం చేయాల్సి ఉన్నందున ఆర్ అండ్ బి అధికారులు రెండు రోజుల్లో అంచనాలు సిద్ధం చేసి, కల్వర్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.
- ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 పనులకు ఈ నెల 7న టెండర్లు ఓపెన్ అవుతాయని, అనంతరం పనులు వేగంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.
- శారదాకాలనీ రోడ్, బ్రాడీపేట, నెహ్రూనగర్ రోడ్‌ల విస్తరణకు, ఎల్సీ నం.3 గేటు దగ్గర ఆర్‌ఓబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఆటో నగర్, అగతవరప్పాడులను కనెక్ట్ చేసేలా రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- పీవీకే నాయుడు మార్కెట్‌కు గతంలో చేసిన డిజైన్లు ఎవరికి నచ్చలేదు కనుక రివైజ్డ్ డిజైన్లను మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేలు సంయుక్తంగా నిర్ణయించాలన్నారు.
- నల్లపాడు చెరువు, బొంగరాలబీడు కార్మిక శాఖ స్థలాలను నగరపాలక సంస్థకు కేటాయిస్తూ ప్రాథమిక ఆమోదం ప్రభుత్వం నుంచి అందాయి. అవి త్వరలో పూర్తి స్థాయి అనుమతులు వచ్చాక కార్యాచరణ చేపడతామన్నారు.
- అసంపూర్తిగా ఉన్న గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ కాంట్రాక్టర్‌ని తొలగించి, నూతన కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో మరమ్మతులకు గురైన రిజర్వాయర్ల పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు.
- శిథిలావస్థకు చేరిన బీఆర్ స్టేడియం రిజర్వాయర్ స్థానంలో రూ.2 కోట్లతో నూతన రిజర్వాయర్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారభం కానున్నాయన్నారు.
- రెడ్డిపాలెం రోడ్ విస్తరణ గతంలో మాస్టర్ ప్లాన్‌కి భిన్నంగా జరిగినందున, సరిచేయాల్సి ఉందని, 3 వంతెనల వద్ద వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తున్నందున, శాశ్వత పరిష్కారం కోసం సుమారు 2 వందల ఆక్రమణలు తొలగించి, వారికి పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- శారదా కాలనీ రోడ్ విస్తరణలో ప్రభావిత 22 మంది భవన యజమానులకు రూ.50.22 లక్షల నష్ట పరిహార చెక్కులను అందించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో వరద తగ్గుముఖం



అరవింద వారధి వద్ద తగ్గుముఖం పట్టిన వరద నీరు



ఆరేపల్లిలో ఎండుతున్న వరి నారుమడి

కొల్లూరు : కృష్ణా నదికి వరద నీటి విడుదలను తగ్గిస్తుండటంతో వరద తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద నీటి విడుదల తగ్గుతుండటంతో బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదిలే నీటి పరిమాణం సైతం క్రమంగా తగ్గుతూ వస్తుంది. గురువారం 2.61 లక్షల క్యూసెక్కుల నీటిని బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేసిన అధికారులు క్రమక్రమంగా ఎగువ నుంచి వచ్చి చేరే నీరు ఆధారంగా సముద్రంలోకి నీటి విడుదలను తగ్గించుకుంటూ వస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కృష్ణా నదికి వరద నీటి విడుదల 1.90 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రవాహ వేగం అధికంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఎండుతున్న వరి నారుమడులు

నగరం: ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు సాగు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. వరుణుడుపై భారం వేసి పోసిన నారును రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాల రాకతో నియోజకవర్గంలోని నగరం, ఆరేపల్లి, సజ్జావారిపాలెం గ్రామాలలో వరి నారుమడులు పోశారు. ఆ తర్వాత వాతావరణంలో మార్పులతో మొలకలు వచ్చిన నారుమళ్లకు నీరు కరువైంది. గాలులు వీయడంతో నారుమళ్లు వడ బడుతున్నాయి.

19 మంది బాలలను రక్షించిన ఆర్పీఎఫ్

మైనర్‌లను అక్రమ రవాణా చేస్తున్న 11 మంది ఏజెంట్లపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు

లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్) : దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో ఆర్పీఎఫ్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 19 మంది మైనర్ బాలురులను రక్షించి 11 మంది ఏజెంట్లపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై చివర వరకు రైలు భద్రత వివరాలను శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు తెలిపారు. ప్రత్యేక నిఘా బృందంతో 19 మంది పలు ప్రాంతాలకు చెందిన మైనర్ బాలురులను రక్షించి 11 మంది ఏజెంట్లపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా మిషన్ రైల్ సురక్షలో డివిజన్ పరిధిలో 17 కేసులు నమోదు చేసి 33 మంది నేరస్తులను అరెస్ట్ చేసి చోరికి గురైన సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రయాణికుల వస్తువులకు సంబంధించి 15 దొంగతనాల కేసులలో 14 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.17.16 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్ల దాడి చేసిన ఇద్దరి పై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అలాగే రైళ్లలో ధూమపానం చేస్తున్న 484 మంది పై కేసులు బనాయించడం జరిగిందన్నారు. ఆపరేషన్ నార్కోస్‌లో 21.123 కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. ఆపరేషన్ నన్హే ఫరిస్తే కార్యక్రమంలో భాగంగా పారిపోయిన 83 మంది పిల్లలను రక్షించడం వారి వివరాలను సేకరించి చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్‌లకు అప్పగించామన్నారు. ప్రయాణికులు వదిలి పెట్టిన రూ.23.11 లక్షలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు రికవరీ చేయడం జరిగిందన్నారు. బచ్‌పన్ బచావ్ ఆందోళన రాష్ట్ర కో ఆర్డినేటర్, ఆర్పీఎఫ్ ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



మంగళగిరి: పోలీసులు క్రీడలలో రాణించడంతో కొత్తగా పవర్ లిఫ్టింగ్‌లో కోచింగ్ తీసుకునేందుకు క్యాంప్ ప్రారంభించడం సంతోషకరమని ఏపీ పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ అభిరామ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిమ్‌లో పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్స్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిరామ్‌రెడ్డి మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ కోచింగ్ తీసుకున్న పోలీసులు పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు కాసుల ఉదయ కిరణ్, క్రీడాకారులు నాగేశ్వరరావు, మస్తానవలి పాల్గొన్నారు.

భక్తులకు రాగి నాణేలు పంపిణీ



ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కోటి లింగాల క్షేత్రంలో 40 అడుగుల లోతున నిర్మిస్తున్న పాతాళకాళీ విగ్రహ ప్రతిష్ఠ పీఠం కింద భక్తులచే రాగి నాణేలు శుక్రవారం వేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు రాగి నాణేలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వాటిని పీఠం కింద భాగంలో వేసే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జ్ఞానప్రసన్న బాబా ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నేటి నుంచి 10వ తేదీ వరకు భక్తులు స్వహస్తాలతో రాగి నాణేలు వేసేలా వారికి ఉచితంగా అందిస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ పురస్కార దరఖాస్తుల స్వీకరణకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు దాఖలు చేసిన ప్రతిపాదనలను డివిజినల్ స్థాయిలో ఉప విద్యాశాఖాధికారి చైర్మన్‌గా నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ జిల్లాస్థాయి కమిటీకి ఈనెల 12వ తేదీలోపు విధిగా సమర్పించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి కమిటీ ద్వారా ఉపాధ్యాయుల తుది జాబితాను రాష్ట్రస్థాయి కమిటీకి ఈనెల 16లోపు సమర్పించాల్సి ఉందని తెలిపారు. ఈనెల 8వ తేదీ తరువాత సమర్పించే దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవని స్పష్టం చేశారు.

కేంద్రీయ విద్యాలయలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం

నాదెండ్ల: ఇర్లపాడు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో శుక్రవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ పరీక్ష శిబిరం 2025 అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణలోని 26 కేంద్రీయ విద్యాలయాల నుంచి స్కౌట్స్ విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు రోజులపాటు జరిగే శిబిరం తెలంగాణ విద్యార్థులతో కళకళలాడింది. ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్స, ఉపాధ్యాయులు ముందుగా ఘనస్వాగతం పలికారు. తొలిరోజు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, స్నేహపూర్వక ప్రయాణం అంశాలపై కార్యక్రమం జరిగింది. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కాగా, సిబ్బంది క్యాంప్ కిట్లు అందించారు. అనంతరం స్కౌట్స్ పెట్రోల్స్, మార్చ్‌ఫాస్ట్, స్వాగత నృత్యం ఆకర్షించాయి. క్వార్టర్ మాస్టర్ ఎస్. విజయ్‌కుమార్, ఎల్‌వోసీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వార్షిక కౌలు అర్జీలు వేగంగా పరిష్కరిస్తున్నాం

సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్


అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్

తాడికొండ: వార్షిక కౌలు సంబంధిత అర్జీలు సాధ్యమైనంత వేగంగా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ పేర్కొన్నారు. అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఇటీవల రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయిన 2024- 25వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యల గురించి పలువురు రైతులు, భూయజమానులు తమ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక కౌలుకు సంబంధించి రైతులు అందజేసిన అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో రైతులకు కౌలు నగదు జమ కానట్లయితే.. సాధ్యమైనంత వేగంగా కౌలు నగదు జమయ్యేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఫేజ్- 1 కింద రైతులకు ఇప్పటికే కౌలు నగదు జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఫేజ్- 2 కింద జమ చేయాల్సిన కౌలు నగదు సాధ్యమైనంత వేగంగా ఖాతాలలో జమ అవుతుందని వివరించారు. కౌలు సంబంధిత అర్జీలకు సంబంధించిన సాంకేతిక సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు సీఆర్డీఏ ఐటీ విభాగ సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారన్నారు. వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన ఫిర్యాదులను పరిష్కరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. 78 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఎ.జి.చిన్నికృష్ణ, కె.ఎస్.భాగ్యరేఖ, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్ అక్విజిషన్) ఎస్‌వీఎస్‌బీ వసంతరాయడు, సీఆర్డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగరావు రామకృష్ణన్, డెవలప్మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.మధుసూదన రావు పాల్గొన్నారు.

మీడియాపై ఆంక్షలు

సీఆర్డీఏలో చేపట్టిన గ్రీవెన్స్‌కు మీడియాను లోపలికి అనుమంతిచకుండా అధికారులు ఆంక్షలు విధించారు. మీడియాతో దురుసుగా ప్రవర్తిస్తూ బయటకు పంపించేందుకు అత్యుత్సాహం ప్రదర్శించారు. మీడియాకు వార్తలు కవరేజ్ చేస్తే కేసులు పెడతానని అడిషనల్ కమిషనర్ అనడంతో మీడియాను అడ్డుకోవడం తగదని పలువురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు పడలేదని దరఖాస్తులు రావడంతో పాటు పలువురు మీడియా ఎదుట ఆవేదన వెల్లగక్కుతుండటంతో అధికారులు ఆంక్షలు విధించారు. దీనిపై పలువురు రాజధాని ప్రాంత వాసులు మండిపడుతున్నారు.

విద్యార్థుల బాధలు పట్టవా

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్


ఆర్‌డీఓ ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

గుంటూరు వెస్ట్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యనభ్యసిస్తున్న దళిత, బహుజన విద్యార్థులను కూటమి ప్రభుత్వం దారుణంగా అవమానిస్తుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్‌ను సందర్శించామన్నారు. మంచినీరు అపరిశుభ్రంగా ఉందన్నారు. మరుగుదొడ్లు దుర్వాసనగా ఉన్నా పిల్లలు అలానే నెట్టుకొస్తున్నారన్నారు. అన్నంలో బొద్దింకలు వస్తున్నాయని తెలిపారు. రుచిశుచీ లేని ఆహారాన్ని పెట్టడానికి మనస్సు ఎలా వచ్చిందన్నారు. మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. మౌలిక వసతులపై స్పందించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ కోసం ఖర్చు చేయడం లేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు రవీంద్ర నాయుడు, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గ అధ్యక్షులు అజయ్, సాజిద్, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు గోపి, జిల్లా నాయకులు భాను, కిరణ్‌లు పాల్గొన్నారు.

గుంటూరు ఆర్డీ సరెండర్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా పనిచేస్తున్న డాక్టర్ కె.సుచిత్రను సరెండర్ చేస్తూ శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.సుచిత్ర గత ఏడాది ఆగస్టు 1న బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరినప్పటి నుంచి తరచూ అనారోగ్య కారణంగా సెలవులు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఫైల్స్ క్లియర్ చేసేందుకు నెలల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తుందని, కోర్టు క్లియరెన్స్ ఫైల్స్ కోసం ఎక్కువ రోజులు వేచి ఉంచుతున్నారనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. ఆర్డీ కార్యాలయ అధికారులు, సిబ్బంది రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఆర్డీగా పనిచేస్తున్న సుచిత్రను మార్చాలని, ఆమె ఉంటే తాము విధులు చేయలేమని రెండు పర్యాయాలు ఫిర్యాదు చేశారు. డాక్టర్ సుచిత్ర కూడా ఆర్డీ కార్యాలయ సిబ్బంది తనపై దాడి చేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫైల్స్‌పై సంతకాలు కోసం వెళ్లేందుకు ఆర్డీ కార్యాలయ సిబ్బంది, అధికారులు భయపడేవారు. పదిరోజులుగా సెలవులో ఉన్న ఆర్డీ సుచిత్ర శుక్రవారం జాయిన్ అయ్యారు. అయితే రాష్ట్ర కార్యాలయం అధికారులు నేరుగా వచ్చి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆమెను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి జిల్లా విలేకరులకు పునశ్చరణ తరగతులు

తెనాలి: సీఆర్ మీడియా అకాడమీ, ఏపీయూడబ్ల్యూయూజే తెనాలి నియోజకవర్గ కమిటీ సంయుక్త నిర్వహణలో గుంటూరు జిల్లా గ్రామీణ విలేకరులకు రెండురోజుల పునశ్చరణ తరగతులు తెనాలిలో జరగనున్నాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శనివారం ఉదయం 10 గంటలకు తరగతుల ప్రారంభోత్సవం జరగనుంది.



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 247

కొమ్ములు : 226 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,100	10,900	10,871

కాయలు : 21 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,100	10,550	9,700

మొత్తం అమ్మకాలు : 185.250 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,300

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	32,350
అమ్మకాలు	35,181
నిల్వ	4,211

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,700
నంబరు-5	10,000-13,400
341	10,000-14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,100
బాడిగ-355	10,000 - 12,800
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,300 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు


ఐవీఎఫ్ సెంటర్లలో వసతులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఐవీఎఫ్ సెంటర్ ఉదంతంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఐవీఎఫ్ సెంటర్లలో (సంతాన సాఫల్య కేంద్రాలు) వైద్య అధికారులు తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 సెంటర్లు ఉండగా, శుక్రవారం 17 సెంటర్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. సెంటర్లలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు స్వయంగా పరిశీలించారు. పలు సెంటర్లలో ఫీజుల వివరాలు తెలియజేసే బోర్డులు లేకపోవడంతో, వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు రికార్డులు సక్రమంగా లేకుండా ఉండటంతో వాటిని కూడా సరైన పద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. ఒక్కో బృందంలో నలుగురు చొప్పున ఐదు బృందాలుగా ఏర్పడి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, గైనకాలజిస్టులు, ఇతర వైద్య సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. శనివారం కూడా తనిఖీలు కొనసాగుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఫీజుల వివరాలు బోర్డులు ప్రదర్శించడం లేదని పలు చోట్ల గుర్తించామన్నారు. తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలని ఆయా ఐవీఎఫ్ సెంటర్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎంఈఓల నియామకాన్ని ఉపసంహరించుకోవాలి


డీఈవో రేణుకకు వినతి పత్రం సమర్పిస్తున్న ఆపస్, పీఆర్టీయూ సంఘాల నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖాధికారులుగా ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిసెంట్లను నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకతో పాటు ఆర్జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను కలిసిన ఆయా సంఘాల నాయకులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టుల్లో ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లను నియమించారని, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసుకు అనుగుణంగా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల అనేక విధాలుగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఎంఈవో-1లుగా ప్రభుత్వ యాజమాన్యంలోని ఉపాధ్యాయులను నియమిస్తూ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులు విస్మరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకే డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను కామన్ సీనియార్టీ ప్రాతిపదికన ఎంఈవోలుగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులను కలిసిన వారిలో ఏపీ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) జిల్లా అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పమిడి పద్మ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వర రావు ఉన్నారు.

డాక్టర్ స్వామినాథన్ జయంతిని జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : ఈనెల 12న జాతీయ రైతు వ్యవసాయ కమిషన్ మాజీ చైర్మన్ హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ జయంతిని జయప్రదం చేయాల్సిందిగా వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ పిలుపునిచ్చారు. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకోవడం కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో డాక్టర్ స్వామినాథన్ కమిటీ వేయడం జరిగిందని గుర్తు చేశారు. రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50శాతం రాబడి వస్తేనే పంట పండించగలరని, కుటుంబం జీవన కొనసాగించగలరని ఈ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ఎప్పటికైనా అమలు అయ్యే విధంగా ఆయన జయంతిని ఉత్సవాలుగా దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌలురైతు, వ్యవసాయ కార్మిక అధ్యక్షులు బైరాపట్నం రామకృష్ణ, శెట్టి బాలరాజు, మొలక శివసాంబిరెడ్డి, బి.కోటేశ్వరి, చింతల భాస్కరరావు, ఇమ్మడి రామారావు, నాగేశ్వరరావు జంపని రామారావు, భద్రయ్య, జోషి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై ముగిసిన 40 గంటల శిక్షణ


మీడియేషన్ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్, న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన ప్లాపస్ చైర్మన్‌లు, మెంబెర్స్‌కు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఒకటో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.ఏ.ఎల్.సత్యవతి మాట్లాడుతూ 40 గంటల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్లాపస్ చైర్మన్ జి.రజిని మాట్లాడుతూ శిక్షకులు మీడియేషన్‌పై అవగాహన కల్పించారని, ఓర్పు, నైపుణ్యంతో అన్ని అనుమానాలను నివృత్తి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా చెన్నై నుంచి శిక్షణ కోసం నియమించిన న్యాయవాది, సీనియర్ ట్రైనర్ రత్నతార, న్యాయవాది, సీనియర్ ట్రైనర్ సత్యారావు, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.ఏ.ఎల్. సత్యవతి, గురజాల పదో అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని సత్కరించారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

గుంటూరు లీగల్: భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి వై.నాగరాజా శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాలు.. పెదకాకాని మండలం అగతవరప్పాడుకు చెందిన తోట ఏడుకొండలు కుమార్తె శారద(26)ను అదే గ్రామానికి చెందిన గవిరిబోయిన శివశంకర్‌తో 2009 మే 6న వివాహం జరిపించారు. శివశంకర్, ఆర్మీలో పనిచేస్తున్నాడు. శివశంకర్ సెలవులో ఇంటికి వచ్చిన సమయంలో, అతడి కుటుంబ సభ్యుల ప్రభావంతో భార్య శారదపై అనుచిత ఆరోపణలు చేయడంతో వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దల మధ్య రాజీ కుదిరినా, ఆ తరువాత శారద తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అప్పట్లో నెలకు శివశంకర్ రూ.3000 చెల్లించడానికి అంగీకరించగా, శారద రూ.6,000 అడిగిన నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకుంది. 2015 జూలై 26న శివశంకర్ భార్య శారదపై కత్తితో దాడి చేసి ఆమెను హత్య చేశాడు. ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మల్లేశ్వరి అనే మహిళ గాయపడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారించిన రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి మొదటి నిందితుడు గవిరిబోయిన శివశంకర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధించారు. రెండో నిందితురాలు గవిరిబోయిన సుబ్బమ్మ మృతి చెందడంతో కేసు ముగించారు.

కేవలం రూపాయికే బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడమ్

నరసరావుపేట: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త ఫ్రీడం ప్లాన్, కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబి డేటా, రోజుకు 100 మెసేజ్‌లు, ఉచిత సిమ్ కార్డు ఇవ్వబడుతుందని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీ సప్పరపు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఎం.ఎన్.పి. వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, కావున అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సిమ్ కార్డు కావలసిన వారు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించవలసినదిగా కోరారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్లకు గాయాలు

వినుకొండ: వినుకొండ మండలం చీకటిగలపాలెం మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు లారీలు ఒకదానికొకటి ఢీకొనగా ఇద్దరు లారీ డ్రైవర్లు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు... తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు మొదట ఢీకొన్నాయి. వాటిని వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. స్థానికులు 108కి సమాచారం తెలపడంతో గాయపడిన ఇద్దరు డ్రైవర్లను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రమాదానికి గురైన వాహనాలను ఘటనా స్థలం నుంచి పక్కకు జరిపించారు. డ్రైవర్లను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు వరి విత్తనాలు వెదబెట్టిన చేలల్లో మొలక దెబ్బతింది. దీంతో ఆయా పొలాల్లో మరోసారి వరి వెదజల్లేందుకు ట్రాక్టర్లతో దున్నిస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలి లోని బుర్రిపాలెంరోడ్డులో శుక్రవారం కనిపించిన దృశ్యం ఇది.

- తెనాలి